ఆదమరిస్తే అంతే సంగతులు..

మొరిపిరాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంత

ఆత్మూరు(ఎం) మండల కేంద్రం నుంచి మొరిపిరాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. దాంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నడిరోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

-ఆత్మకూరు(ఎం), మే 20

జనం లేక వెలవెలబోయిన అంగడి

ఆత్మకూరు(ఎం) అంగడి వెలవెల

ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని బక్క మల్లయ్యకుంటలో ప్రతి సోమవారం నిర్వహించే అంగడి వివిధ మండలాల నుంచి వచ్చే వ్యాపారులతో పాటు మేకలు, గొర్రెలు, పశువుల కొనుగోలు, అమ్మకం దారులతో కిటకిటలాడేది. కానీ, సోమవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వ్యాపారులతో పాటు రైతులు రాకపోవడంతో అంగడి వెలవెలబోయింది.

-ఆత్మకూరు(ఎం), మే 20

పచ్చని పట్టణ ప్రగతి పార్కులు

చౌటుప్పల్ 9వ వార్డులో నిర్మించిన పట్టణ ప్రకృతి వనం

చౌటుప్పల్, మే 20 : చౌటుప్పల్ మున్సిపాలిటీ వ్యాప్తంగా పట్టణ ప్రగతిలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వార్డుల వారీగా ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. అందులో నీడనిచ్చే మొక్కలతోపాటు అలంకరణ మొక్కలు పెంచారు. కొన్నింట్లో పిల్లలు ఆడుకునేందుకు కూడా ఆట వస్తువులు, మార్నింగ్ వాకింగ్ ట్రాక్‌లు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం ఆ వనాలు సమీప ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం హరిత హారం లక్ష్యానికి తీపి గుర్తులుగా ఈ పార్కులు దర్శనమిస్తున్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పట్టపగలే వీధిలైట్లు..

భూదాన్‌పోచంపల్లిలో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

భూదాన్‌పోచంపల్లి, మే 20 : పట్టణ కేంద్రంలో వీధిలైట్లు పట్టపగలే వెలుగుతున్నాయి. విద్యుత్ సిబ్బంది లైట్లు బంద్ చేయకపోవడంతో లైట్లను చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు పగటిపూట వీధిలైట్లు వెలుగకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌పై వాకర్స్‌తో ముచ్చటిస్తున్న మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

మినీ ట్యాంక్‌బండ్‌పై సరదాగా కాసేపు

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో వాకర్స్ సెల్ఫీలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డికే మద్దతిస్తామన్న పట్టభద్రులు

సూర్యాపేట టౌన్, మే 20 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మద్దతుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రచార కార్యక్రమంలో పాల్గొని బీజీగా గడిపిన మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సాయంత్రం జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్‌పై కాసేపు సరాదాగా గడిపారు. ఈ సందర్భంగా వాకర్స్, సందర్శకులు, యువత పెద్ద ఎత్తున మాజీ మంత్రి చుట్టూ చేరి ఆయనతో సెల్ఫీలు దిగారు. సుమారు గంట పాటు ప్రజలతో కలిసి ట్యాంక్ బండ్‌పై తిరిగిన జగదీశ్‌రెడ్డితో ప్రజలు అనేక విషయాలు పంచుకున్నారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేస్తూ.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి, తాము పడుతున్న ఇబ్బందులను చాలామంది జగదీశ్‌రెడ్డితో పంచుకున్నారు. ఈ నెల 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి తాము ఓటు వేస్తామని పట్టభద్రులు చెప్పారు.

సూర్యాపేట వాసులకు గ్లోబల్ ఐకాన్ అవార్డులు

అవార్డును అందుకుంటున్న సూర్యాపేట వాసులు

బొడ్రాయిబజార్, మే 20 : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతో పాటు స్వచ్ఛందంగా సాయం చేసిన రెడ్ క్రాస్ సభ్యులు గ్లోబల్ ఐకాన్ అవార్డులు అందుకున్నారు. మంజునాథ ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు, సినీ ఆర్టిస్టులకు, పారిశ్రామిక వేత్తలకు, వివిధ రంగాల్లో ప్రతిభ కనభర్చిన వారికి అవార్డులు అందించింది. సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి సూర్యాపేటకు చెందిన రెండ్‌క్రాస్ సభ్యులు బైరు రమేశ్, అరమగాని రాములు, కారింగుల రమేశ్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డులు అందించారు. వారిని స్థానికులు అభినందించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ బీఎస్ లత

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

సూర్యాపేట, మే 20 : ఈ నెల 24 నుంచి జరుగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 9,145 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 5,879 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 2076 మంది, 1190 మంది ఒకేషనల్ విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి, రెండో సంవత్సరంలో ఫెయిల్ అయిన వారితో పాటు అధిక మార్కుల కోసం ఇంప్రూమెంట్ పరీక్ష కూడా రాస్తున్నారన్నారు. ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు జరిగే పరీక్షల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 8 పరీక్ష కేంద్రాలు, కోదాడలో 5, హుజూర్‌నగర్ 2, తిరుమలగిరి, తుంగతుర్తి, నిమ్మికల్, నడిగూడెం, నేరేడుచర్ల, మఠంపల్లిలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు 144వ సెక్షన్ అమలు చేయాలని, ట్రాన్స్‌కో అధికారులలు కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఐఈఓ కృష్ణయ్య, పద్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

వరికుప్పల అఖిల్(ఫైల్)

ఆత్మకూర్.ఎస్, మే 20 : మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన వరికుప్పల అఖిల్ సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన వరికుప్పల కనకయ్య తన వ్యవసాయ బావిలో కుటుంబ సభ్యులతో కలిసి క్రేన్ సాయంతో పూడిక తీస్తుండగా క్రేన్ విద్యుత్ తీగలకు తగలడంతో ఆయన కుమారుడు వరికుప్పల అఖిల్(19) విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

పెన్‌పహాడ్ మండలంలో..

పెన్‌పహాడ్ : మండలంలోని పెద్ద గారకుంట తండాలో సోమవారం విద్యుదాఘాతంతో రెండు బర్రెలు మృతి చెందాయి. తండాకు చెందిన బానోతు సైదులుకు చెందిన వ్యవసాయ భూమిలోని విద్యుత్ స్తంభాల తీగలు ఈదురు గాలులకు తెగి పడ్డాయి. అదే తండాకు చెందిన బానోతు నాగు, బానోతు సక్రుకు చెందిన బర్రెలు మేత కోసం వెళ్లగా విద్యుత్ తీగలు వాటి కాళ్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాగరాజు (ఫైల్)

గరిడేపల్లి, మే 20 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గరిడేపల్లి ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన పేరబోయిన నాగరాజు (40) తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఆదివారం పల్సర్ బైక్‌పై హుజూర్‌నగర్‌కు వెళ్లాడు. పని ముగించుకొని రాత్రి ఇంటికి వస్తుండగా.. రాయినిగూడెం గ్రామ శివారు వద్ద రోడ్డుపై ఉన్న గేదె కనిపించక దానిని ఢీకొట్టాడు. దాంతో కింద పడిపోయిన నాగరాజు తలకు, చాతిపై తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లగా అక్కడి డాక్టర్ సలహా మేరకు మరో దవఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సాగర్ సిమెంట్స్ పరిశ్రమలో ప్రచారం చేస్తున్న దివ్యాంగులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి

తిరుమలగిరి, మే 20 : ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టితో గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని పెద్దల సభకు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నరోత్తంరెడ్డి, రవీందర్, షకీల్, నరేశ్, పట్టభద్రులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ప్రచారం

మఠంపల్లి : పట్టభద్రుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే దమ్మున్న వ్యక్తి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి పట్టబద్రులందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని దివ్యాంగుల సేవా సమితి నాయకుడు వేముల జోసఫ్ కోరారు. సోమవారం మండలంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమలో రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట సమితి నాయకులు ఉన్నారు,

సబ్సిడీ విత్తనాలు అందించాలని వినతి

ఏఓకు వినతి పత్రం అందిస్తున్న రైతుసంఘ నాయకులు

హుజూర్‌నగర్ , మే20 : వానకాలం సాగు కోసం రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఏఓ స్వర్ణకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ఆరంభం కానున్న నేపథ్యంలో రైతులకు సబ్సీడీపై జీలుగ, పెసలు, కందులు, వేరుశనగ విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని, రైతులకు తగు సూచనలు సలహాలు అందించాలని కోరారు. ఆయన వెంట సంఘం నాయకులు రేపాకుల మురళి, పాశం వీరబాబు, లక్ష్మి, వెంకటి, వెంకన్న, వీరయ్య, సైదులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో శాస్త్రోక్తంగా పరమపదోత్సవం


పరమపద ఉత్సవ పూజ చేస్తున్న అర్చకులు

మఠంపల్లి, మే 20 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం మూడో రోజు పరమపదోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు తూమాటి కృష్ణమాచార్యులు, కుమ్మరికుంట్ల బదిరీనారాయణచార్యులు, ఆంజనేయచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, అనంతాచార్యులు, నర్సింహాచార్యులు, భక్తులు,ఆలయ స్బిబంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్లు 13,160

- పురుషులు 8,975
- స్త్రీలు 4,185

నేరేడుచర్లలో పట్టభద్రులకు ఓటర్ స్లిప్‌లు అందజేస్తున్న బీఎల్ఓలు

నేరేడుచర్ల, మే 20 : ఈ నెల 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 7 మండల కేంద్రాల్లో పోలింగ్ బూత్‌లను గుర్తించడంతో పాటు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకున్న పట్టభద్రులకు బీఎల్ఓల ద్వారా ఓటర్ల స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 13,160 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు- 8,975, స్త్రీలు-4,185 మంది ఓటు కలిగి ఉన్నారు. వారంతా ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం ప్రత్యేకంగా మండల కేంద్రాల్లో 18 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. నేరేడుచర్ల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో-3, పాలకవీడు జడ్పీహెచ్ఎస్-1, మఠంపల్లి వివేకవర్ధని హైస్కూల్-2, మేళ్లచెరువు జడ్పీహెచ్-1, చింతలపాలెం జడ్పీహెచ్ఎస్-1, హుజూర్‌నగర్‌లో మొత్తం- 7 కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో విజయ విద్యా మందిర్ స్కూల్‌లో-2, ఎన్ఎస్పీ క్యాంప్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో- 2, ప్రభుత్వ పాఠశాలలో-3, గరిడేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో-3 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వాటిలో విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చే పట్టభద్రులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

బీఎల్ఓల ద్వారా ఓటర్ స్లిప్పుల పంపిణీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రుల ఓటర్ స్లిప్పులను బీఎల్ఓల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పులను అందజేసే విధంగా చర్యలు చేపట్టారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల వివరాలు

మండలాలు	పట్టభద్రుల ఓటర్లు
నేరేడుచర్ల	2,290
పాలకవీడు	879
మఠంపల్లి	1,837
మేళ్లచెరువు	1,334
చింతలపాలెం	791
హుజూర్‌నగర్	3,448
గరిడేపల్లి	2,581
మొత్తం	13,160

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆర్డీఓ శ్రీనివాసులు

మఠంపల్లి, మే 20 : మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం మట్టపల్లిలోని ఆర్య వైశ్య నిత్యాన్నదాన సత్రంలో నిర్వహించిన సమావేశంలో కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణోత్సవాలకు సుమారు 50వేల మందికి పైన భక్తులు రావచ్చని, వారికి తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తాగునీరు, చలువ పందిళ్లు, టెంట్లు, ఎల్ఈడీ లైట్లు, క్యూలైన్లు, కృష్ణానది వద్ద షవర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దైవ దర్శనం, లడ్డూ ప్రసాదం కోసం టికెట్ల కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్ని కులాలకు చెందిన అన్నదాన సత్రాలు ఉండడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సిమెంట్స్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో తాసీల్దార్ మంగా రాథోడ్, ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, వివిధ శాఖల అధికారులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాశెట్టి బుజ్జి, ప్రధాన కార్యదర్శి గెల్లి విద్యాసాగర్, వంగవేటి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారానికి చట్టపరమైన చర్యలు

- ఎస్పీ రాహుల్ హెగ్డే

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటసిటీ, మే 20 : పోలీస్ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తూ.. బాధితుల సమస్యల పరిష్కారానికి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 10 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. వీటిపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులతో మాట్లాడారు. పోలీసుల పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించాలని, బాధితులకు న్యాయం చేసేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే, ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపట్ల, సామాన్యులను ఇబ్బంది పెట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు.

హనుమాన్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

అర్వపల్లి, మే 20 : మండలంలోని తిమ్మాపురంలో జూన్ 1న నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యే మందుల సామేల్‌కు క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రికలు అందించారు. హనుమాన్ జయంతి వేడుకలతో పాటు సీతారాముల కల్యాణాన్ని కూడా జరిపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇందుర్తి వెంకటరెడ్డి, రత్నం, లక్ష్మాజీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

జనార్దన్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్

బొడ్రాయిబజార్, మే 20 : సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రతిఘటన పోరాట యోధుడు కామ్రేడ్ జలగం జనార్దన్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్ కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జలగం జనార్దన్ పీడిత తాడిత ప్రజల పక్షాన అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టాడన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చండ్రపుల్లారెడ్డి విజ్ఞన కేంద్రంలో జనార్దన్ వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఇప్టు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, నాయకులు
సామ నర్సిరెడ్డి, పుల్గూరి సింహాద్రి, వీరబోయిన రమేశ్, బొల్క పవన్, పిడమర్తి భరత్, ఎస్‌కే.రహీం పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సన్మానం

వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, మే 20 : ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నాగిణి, సూపర్‌వైజర్ జయమ్మతో పాటు సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో క్లబ్‌ల సభ్యులు గెల్లి లక్ష్మీనారాయణ, జూలూరు అశోక్, తాళ్లూరి శ్రీనివాస్, గెల్లి లక్ష్మీప్రసన్న, కొత్త లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలత, రాచకొండ శ్రీను, పరమేశం, మోహన్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాగారం, మే 20 : మండలంలోని ఈటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, భిక్షం, ఉప్పలయ్య, ఎల్లాచారి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.